సాక్షి సంగారెడ్డి

బుధవారం ၊ 6 ၊ డిసెంబర్ ၊ 2023



'మన బడి'పై నీలినీడలు

విద్యార్థులకు కార్పొరేటు విద్యనందించాలనే ఉద్దేశంతో 2022 జూన్‌లో సర్కార్ 'మన ఊరు మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వివరాలు 8లో ▸



దేవాలయంలో చోరీ

ఎనగండ్ల పంచాయతీ దుంపలకుంట రేణుకా మాత ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు 8లో ▸



ఓడినా ప్రజలకు సేవలందిస్తా

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా ప్రజల్లోనే ఉంటూ సేవలందిస్తానని నియోజకవర్గ చీఫ్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి చంద్రశేఖర్ అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మాజీ ఎమ్మెల్యే రూ.1.50 లక్షల సహాయం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యుత్ షాక్ బారిన పడి కాళ్లు చచ్చుపడిపోయిన ఒక వ్యక్తికి సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆర్థిక సాయంచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన గుతాపిల్లి రాజు కొన్ని నెలల క్రితం విద్యుత్ షాక్ తగలడంతో ప్రమాదంలో తన రెండు కాళ్లు పనికి రాకుండా పోయాయి. విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి మంగళవారం తన కుమారుడు భారత్ సాయి రెడ్డి, సతీమణి నిర్మలరెడ్డి ద్వారా రూ.1.50 లక్షల సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. వారి వెంట సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.

13 మంది మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 13 మందికి జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమానా విధించినట్లు చెప్పారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ విజయ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇల్లినోస్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ ఎల్దండి సూచించారు. మంగళవారం ఆయన ఆరోగ్య పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఆ కార్యక్రమంలో మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచి ఆహారంతో పాటు ఒక గంట వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం సొసైటీ డైరెక్టర్ బాలబోయిన సుదర్శన్ మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు కొల్లూరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ కొల్లూరి భరత్ కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్: పంట సాగులో రైతులు రసాయన ఎవురుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి సూచించారు. మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ నేల దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ రసాయన మందులు, కలుపు మందులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల నేల కలుషితం అవుతోందన్నారు. అంతే కాకుండా భారీ వర్షాలు కురిసినప్పుడు సారవంతమైన నేల మట్టి కొట్టుకునిపోయి భూమికి నష్టం జరుగుతున్నదన్నారు. రైతులు ఇప్పటి నుంచే భవిష్యత్ తరాల కోసం పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ, ఏఈఓలు ప్రదీప్‌కుమార్, వీరేందర్, అజ్మత్‌పాషా, అశోక్, పాండు, వెంకటేశం, శివన్న, అరవింద్, కృష్ణ, సంజు, మౌలానా, రామకృష్ణ, మోహన్ రెడ్డి, బాబు, ఎల్లప్ప పాల్గొన్నారు.

నోటా కంటే తక్కువ ఓట్లు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానానికి 18 మంది అభ్యర్థులు పోటీ చేయగా అందులో 10 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు పోలైయ్యాయి. నోటాకు 858 ఓట్లు పడ్డాయి. అలిగే జీవన్‌కు 136, అంకుష్‌కు 126, ప్రకాశ్ రాథోడ్‌కు 640, నర్సింహులుకు 340, రమేశ్‌నాయక్‌కు 148, గోపాల్‌రెడ్డికి 574, అంజాగౌడ్‌కు 400, నర్సారెడ్డికి 154 నాగేశ్వర్‌రావుకు 381, అకోశ్‌కు 772 ఓట్లు వచ్చాయి.

ఫలించిన మంత్రాంగం

- ఆ ఇద్దరినీ విజయానికి చేరువ చేసిన ట్రబుల్‌షూటర్
- సంగారెడ్డి, జహీరాబాద్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హరీశ్‌రావు
- రెండుచోట్ల సన్నిహితులకు కీలక బాధ్యతలు
- పకడ్బందీ వ్యూహాలను అమలుచేసిన మాజీ మంత్రి



హరీశ్‌రావు



చింతా ప్రభాకర్



కొనింటి మాణిక్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్ర రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆ రెండు నియోజకవర్గాల్లో గులాబీ పార్టీ అభ్యర్థులను విజయ తీరాలకు చేర్చారు. పకడ్బందీ వ్యూహాలను అమలు చేసి ఆ రెండు చోట్ల బీఆర్‌ఎస్ జెండా ఎగిరేలా చేయగలిగారు. హస్తం పార్టీ హవాలోనూ సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ కంటే ఓ సీటు అధికంగా గెలుచుకోవడం ద్వారా పట్టు నిలుపుకునేలా చేయడంలో హరీశ్‌రావు సఫలీకృతుడయ్యారు. ఆయన ముఖ్యంగా సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాలను ప్రతిష్టత్మకంగా తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆ రెండు స్థానాల్లో మాత్రం బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు బాధ్యతలను పూర్తిగా తన భుజాన వేసుకున్నారు. ఆయనకు అత్యంత సన్నిహితులు ఒకరిద్దరు నాయకులకు కీలక ఎన్నికల బాధ్యతలు అప్పగించినా హరీశ్ వారితో తన వ్యూహాలను తు.చ తప్పకుండా అమలు చేయించారు. తద్వారా అక్కడ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులిద్దరినీ విజయం వైపు నడిపించారు.

సంగారెడ్డిలో పక్కా వ్యూహం

సంగారెడ్డిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ఎన్నికల పోరు హోరాహోరీగా సాగింది. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బరిలో ఉండగా, బీఆర్‌ఎస్ టిక్కెట్టును హరీశ్‌రావు పట్టుబట్టి చింతా ప్రభాకర్‌కు ఇప్పించుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి రెండు నెలల ముందు నుంచే పక్కా ప్రణాళికను రూపొందించుకుని.. పోలింగ్ ముగిసేసే చివరి నిమిషం వరకు పకడ్బందీగా అమలు చేయించారు. ఆ టిక్కెట్టు ఆశించి భంగపడి అసమ్మతి రాగం వినిపించిన ముఖ్య నాయకులను, చింతా ప్రభాకర్‌తో అంతర్గత విభేదాలున్న కొందరు ద్వితీయ శ్రేణి నాయకులను హరీశ్‌రావు బుజ్జగించి సమన్వయం చేశారు. తాను స్వయంగా అసమ్మతి నేతల ఇంటికి వెళ్లి అసమ్మతి నేతలను దారికి తెచ్చుకున్నారు. నామినేషన్ సమయానికి ఎక్కడా చిన్న అసంతృప్తులకు కూడా తావులేకుండా క్యాడర్‌ను ఏకతాటిపై నడిపించారు. ప్రచార సరళిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే.. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల ఎత్తుకు పైఎత్తులు వేస్తూ వచ్చారు. అవసరం మేరకు వ్యూహాలను మారుస్తూ క్యాడర్‌ను ముందుకు నడిపించారు. బహిరంగసభలు, రోడ్‌షోలు, ఎన్నికల ప్రచారంపై ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తూ వచ్చారు. పోలింగ్ రెండు రోజులు ఉండగా సీఎం కేసీఆర్ బహిరంగసభను సంగారెడ్డిలో నిర్వహించేలా హరీశ్‌రావు కేసీఆర్ ప్రచార షెడ్యూల్‌ను ఖరారు చేయించారు. అక్కడ పోలింగ్‌కు రెండు రోజుల ముందు నిర్వహించే పోల్ మేనేజ్‌మెంట్ కూడా పకడ్బందీగా జరిగింది. ఇలా పోలింగ్‌కు రెండు నెలల ముందు నుంచి ఒక ప్రణాళికాబద్ధంగా గులాబీ శ్రేణులను నడిపించిన హరీశ్ సంగారెడ్డిలో చింతా ప్రభాకర్‌ను విజయ తీరాలకు చేర్చగలిగారు.

కర్నాటక ప్రభావం ఉన్నా..

జహీరాబాద్ నియోజకవర్గాన్ని కూడా హరీశ్‌రావు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గులాబీ పార్టీ అభ్యర్థి మాణిక్‌రావును గెలిపించారు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌కు అక్కడ కీలక బాధ్యతలను అప్పగించి ఆయన ద్వారా ఎన్నికల వ్యూహాన్ని పక్కాగా అమలు చేయించగలిగారు. జహీరాబాద్ కాంగ్రెస్ ఖాతాలో పడుతుందని మొదటి నుంచి అన్ని రాజకీయ వర్గాలు భావించాయి. కర్నాటక ఎన్నికల ఫలితాలు, మైనార్టీలు అధికంగా ఉన్న ఈ స్థానంలో కాంగ్రెస్ సులభంగా గెలుస్తుందని అంచనా వేసుకున్నారు. సర్వేలు కూడా ఆ స్థానం కాంగ్రెస్‌దే అన్నట్టు వివరించాయి. అయినప్పటికీ క్యాడర్ ఏమాత్రం నిరాశ చెందనీయకుండా చివరి క్షణం వరకు పోరాటం చేసేలా చేయడంలో హరీశ్‌రావు సఫలీకృతుడయ్యారు. పార్టీకి మేలు జరుగుతుందని తెలిస్తే బూత్ స్థాయి కార్యకర్తతో కూడా ఆయన స్వయంగాగానీ, ఫోన్లోగానీ మాట్లాడారు. మైనస్ ఉన్న మండలాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తమ వైపు తిప్పగలిగారు. ప్రభావం చూపే సామాజికవర్గాలతో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ను ఆదరించేలా చేశారు. పలు మండలాల్లో విభేదాలతో ఉన్న నేతలను హైదరాబాద్‌కు పిలిపించుకుని వారిని సమన్వయం చేశారు. జహీరాబాద్‌లో హరీశ్‌రావు అన్నీ తానై ఎదురొడ్డి నిలబడి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును ముందుకు నడిపించారు.



మొక్కులు తీర్చుకుంటున్న దామోదర రాజనర్సింహ, ఆయన కుమార్తె త్రిష

ఆరు గ్యారంటీల అమలుకు కృషి

ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా గ్రామంలోని రంగనాథస్వామి ఆలయంలో తన కుమార్తెతో త్రిష కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలన్నింటినీ కచ్చితంగా నేరవేరుస్తామని స్పష్టం చేశారు. అక్సాన్‌పల్లికి చెందిన సీడీఆర్, త్రిషమ్మ యువసేన ఆధ్వర్యంలో జోగిపేట ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని త్రిష ప్రారంభించారు. అనంతరం పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు ఆకుల సత్యనారాయణ, సురేందర్‌గౌడ్, రంగ సురేశ్, రేఖా ప్రవీణ్, శంకర్, నాగరాజ్, హరికృష్ణాగౌడ్, దుర్గేశ్, చందర్, పీసీసీ మాజీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్, పద్మనాభ రెడ్డి, వినయ్ గౌడ్, శ్రీధర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను అభినందించిన ఆత్మకూర్ ప్రజలు

అందుబాటులో ఉంటా..

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజలందరి ఆశీర్వాదాలతో ఎమ్మెల్యేగా విజయం సాధించిన తాను అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన 150 మంది, ఎండ్ల బజార్ బసవేశ్వర మందిరం వీరశైవ సమాజం అధ్యక్ష, కార్యదర్శివర్గ సభ్యులతో పాటు వీరశైవ సమాజం సభ్యులు ఆయనను కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన గెలుపు గురించి శ్రమించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరి నమ్మకాలను వమ్ము చేయబోనన్నారు. కార్యక్రమంలో రైతుబంధు మండల కోఆర్డినేటర్ పట్లోళ్ల అమరేందర్‌రెడ్డి, ఆత్మకూర్ ముదిరాజ్ అధ్యక్షుడు కల్పగూర్ ప్రభు, పీఏసీఎస్ డైరక్టర్ మోతిసింగ్, వార్డు సభ్యులు గురురాజ్‌స్వామి, భాగన్న, యాదయ్యగౌడ్, సంగమేశ్వర్, మోహన్ యువనాయకులు మునిపల్లి బాల్‌రాజ్, రమేశ్, నవీన్, వినోద్, నరేశ్, శివకుమార్, నాగరాజ్ స్వామి, ఎడ్ల బజార్ విరశైవ సమాజం అధ్యక్షుడు ముద్దనాగు, ప్రధాన కార్యదర్శి గందిగరాజు, మాజీ కౌన్సిలర్ అన్నిశెట్టి మల్లేశం, విరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

దెబ్బతిన్నది ఎక్కడ?

- ఓటమిపై బీఆర్‌ఎస్‌లో అంతర్మథనం
- ముఖ్య కార్యకర్తలతో సమీక్ష
- అతి విశ్వాసమే కొంపముంచిందా



నారాయణఖేడ్: ఎలాగైనా గెలుపొంది హ్యాట్రిక్ సాధించి ఖేడ్ నియోజకవర్గంలో చరిత్ర తిరగరాస్తామన్న బీఆర్‌ఎస్ నాయకుల ధీమా కుదేలైంది. క్యాడర్ పటిష్టంగా ఉండడం, ప్రత్యర్థి పార్టీలోకి ముఖ్య నాయకుల వలసలు లేకపోవడం, ఏడేళ్ళ పాటు సంక్షేమ పథకాలు అమలు చేయడం, ఎప్పుడూ ప్రజల్లోనే ఉండడం వల్ల గెలుపు సునాయాసం అవుతుందన్న ఆలోచనలకు భిన్నంగా ఫలితాలు రావడంతో నేతలు ఖంగుతిన్నారు. ఎక్కడ దెబ్బతిన్నామనే ఆలోచన పార్టీలో వ్యక్తం అవుతోంది. ఈ అంశంపై ఆయా గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులతో అభ్యర్థి భూపాల్‌రెడ్డి సమీక్ష జరిపారు. గ్రామాల వారీగా వచ్చిన ఓట్లు, పలు గ్రామాల్లో ఊహించిన దానికి భిన్నంగా ఓట్లు పోలవడం.. తక్కువ ఓట్లు రావడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు తాము బాగానే కష్టపడ్డామని చెబుతూనే ఏదో ఓకారణం చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. గత ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో వచ్చిన ఓట్లు, ప్రస్తుతం వచ్చిన ఓట్లకు చాలా తేడా ఉండడంపై ఆరా తీశారు.

అతి విశ్వాసమే కొంప ముంచిందా..

నారాయణఖేడ్‌లో 17 మార్లు ఎన్నికలు జరగగా వరుసగా రెండు సార్లు మినహా మూడో పర్యాయం ఏ ఎమ్మెల్యే కూడా గెలుపొందలేదు. ఈ సారి తాము హ్యాట్రిక్ సాధించి రికార్డు నెలకొల్పుతామని బీఆర్‌ఎస్ నాయకులు గట్టి నమ్మకం వ్యక్తం చేస్తూ వచ్చారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం, లబ్ధిదారులకు పథకాల చెక్కులు అందజేయడం, నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండడంతో ఈ సారి ప్రజలు తప్పకుండా తమకే పట్టం కడతారన్న నమ్మకం పార్టీ నాయకుల్లో బలంగా నాటుకుంది. తమ ధీమా, కొందరు కింది స్థాయి నాయకులు, అనుయాయుల ఆగడాలు పెరగడం కూడా పార్టీని దెబ్బ తీసిందన్న విమర్శలూ వ్యక్తం అవుతున్నాయి.

అనుకూల ప్రాంతాల్లో ప్రతికూలం

బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్న చాలా గ్రామాల్లోనూ ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఊహించిన మేర ఓట్లు రాలేదు. కల్హేర్ మండలం బీఆర్‌ఎస్‌కు పెట్టిన కోట. ఆ మండలంలో కేవలం 711 ఓట్ల ఆధిక్యత మాత్రమే వచ్చింది. గతంలో ఉమ్మడి మండలంగా ఉన్న సిర్గాపూర్ మండలం కాంగ్రెస్‌కు 748 ఓట్ల ఆధిక్యతను ఇచ్చి కల్హేర్ మండలం ఆధిక్యతను సమం చేయగలిగింది. పెద్దశంకరంపేట మండలంలో కొందరు నాయకులకు పార్టీలో 'అతి ప్రాధాన్యం' లభించేది. ఆ మండలంలో మంచి మెజార్టీ వస్తుందని భావించినా అందుకు భిన్నంగా కాంగ్రెస్‌కు 1,813 ఓట్ల ఆధిక్యత లభించింది. నాగల్‌గిద్ద మండలం ఒక్కటే 859 ఓట్ల ఆధిక్యతను టీఆర్‌ఎస్‌కు కట్టబెట్టింది. మిగతా ఉమ్మడి నారాయణఖేడ్ మండలం కాంగ్రెస్‌కు 2,718 ఓట్లు, మనూరు 1,476 ఓట్ల ఆధిక్యతను కాంగ్రెస్‌కు కట్టబెట్టింది. ముఖ్యంగా కొన్ని మండలాల్లో పలు గ్రామాలు బీఆర్‌ఎస్‌కు మంచి పట్టు ఉండగా ఆ గ్రామాల్లో ఊహించిన ఓట్లు పొందలేక పోయింది. కల్హేర్ మండలంలో అభ్యర్థి భూపాల్‌రెడ్డి స్వగ్రామం ఖానాపూర్‌లో కాంగ్రెస్ గతంలో సింగిల్ డిజిట్ ఉండాల్సి ఉండగా ఎన్నడూ లేని విధంగా 193 ఓట్లను పొందింది. బీజేపీ 15 ఓట్లు పొందగా బీఆర్‌ఎస్ 656 ఓట్లను పొందింది. బీఆర్‌ఎస్‌కు పటిష్టమైన కృష్ణాపూర్‌లో కాంగ్రెస్ 585 ఓట్లను పొందగా, బీఆర్‌ఎస్ 1,119 ఓట్లు పొందింది. బీఆర్‌ఎస్ కంచుకోట అయిన బీబీపేటలో 607 ఓట్లను మాత్రమే పొందగా కాంగ్రెస్ 700 ఓట్లను పొంది 93 ఓట్ల ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. కల్హేర్, మార్డి, బాచేపల్లి, కంగ్టి మండలంలో దెగుల్‌వాడీ, దామర్‌గిద్ద, గాజుల్‌పాడ్, ఘన్‌పూర్, చాప్టా(కె), భీంరా, పెద్దశంకరంపేట మండలంలో మక్తలక్ష్మాపూర్, బద్దారం, గోపని వెంకటాపూర్, రామోజీపల్లి, వీరోజీపల్లి, పెద్దశంకరంపేట పట్టణం, మాడ్సెట్‌పల్లి, మనూరు మండలంలో పుల్‌కుర్తి, బాదల్‌గాం, ఎల్గోయి, నారాయణఖేడ్ మండలంలో ర్యాకల్, ర్యాలమడుగు, లింగాపూర్, రుద్రారం, తుర్కాపల్లి గ్రామాల్లో ఊహించి న ఓట్లు బీఆర్‌ఎస్ పొందలేక పోయింది. దళితబంధు పథకం కింద ఎంపికైన రుద్రారం గ్రామంలో రూ.9.50 కోట్లతో గ్రామంలో గల 95 దళిత కుటుంబాలకు పథకం అమలు చేసినా ఆ గ్రామంలో కాంగ్రెస్ 54 ఓట్ల ఆధిక్యాన్ని పొందింది.

అభివృద్ధే గెలిపించింది

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే తనను గెలిపించిందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకి సంగమేశ్వర ఆలయంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలుపునకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంటు చైర్మన్ మహ్మద్ తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లలితా పారాయణం

కొండపాక(గజ్వేల్): వంద మంది మహిళలు లలితా పారాయణం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం శివారులోని ఆనంద నిలయం ఆవరణలో ఇటీవల నిర్మించిన అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం లలితా పారాయణం చేపట్టారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా అష్టా దశ శక్తి పీఠం దేవాలయాన్ని నిర్మించారు. సుమారు రెండు గంటల పాటు పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



లలితా పారాయణం చేస్తున్న మహిళలు

చైర్మన్ పదవికి చింతా ప్రభాకర్ రాజీనామా



సంగారెడ్డి: తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి చింతా ప్రభాకర్ మంగళవారం రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించారు. 2022, సెప్టెంబర్ 28న చింతా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. 14 నెలల 7 రోజుల పాటు ఆయన పదవిలో కొనసాగారు. తాజాగా సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా ఆ పదవికి రాజీనామా చేశారు.

ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక: మున్సిపల్ పరిధిలో ఉన్న లచ్చపేట మోడల్ స్కూల్లో జంతుశాస్త్ర(జువాలజీ) విభాగంలో గంటల ప్రాతి పదికన బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత విభాగంలో పీజీతో పాటు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అర్హతలుండి ఆసక్తి, ఉత్సాహం గల వారు గురువారం లచ్చపేట మోడల్ స్కూల్లో జరిగే డెమోకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94923 01836 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ధోబీ ఘా'పా'ట్లు

- జిల్లాలో మొత్తం 17
- బోర్లు ఉన్నా విద్యుత్ కనెక్షన్లు సున్నా
- నీటి వసతి లేక నిరుపయోగం
- రజకుల అవస్థలు, వినతులు పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్ శివారులో నిరుపయోగంగా ఉన్న ధోబీ ఘాట్లు

హత్నూర(సంగారెడ్డి): రజకుల సంక్షేమం కోసం ఏళ్ల క్రితం నిర్మించిన ధోబీ ఘాట్లు సౌకర్యాలు లేక నిరుపయోగంగా మిగిలిపోయాయి. కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరగా మరికొన్ని పైపులైన్ కనెక్షన్లు లేక, విద్యుత్ సౌకర్యానికి నోచుకోక అలంకార ప్రాయంగా మారాయి. జిల్లాలో మొత్తంలో ఉన్న 17 ధోబీ ఘాట్ల ఉండగా వాటి అన్నిటిదీ ఇదే దుస్థితి.

హత్నూరలో..

హత్నూర మండలంలోని దౌల్తాబాద్, హత్నూర చింతల్చెరువు గ్రామాల్లో కొన్నేళ్ల క్రితం నిర్మించిన ధోబీ ఘాట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. దీంతో నీటి కొరతతో చాలా ఏళ్లుగా అవి నిరుపయోగంగానే మిగిలాయి. హత్నూరలోని ధోబీ ఘాట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అలాగే దౌల్తాబాద్లో నిర్మించిన ఘాట్‌కు బోరువేసి మోటారు బిగించినప్పటికీ విద్యుత్ కనెక్షన్ లేదు. పైప్‌లైన్ వేయకపోవడంతో ఐదేళ్లుగా నిరుపయోగంగానే మిగిలింది. కొండాపూర్, గొల్లపల్లి, చింతల్చెరువులో సైతం ధోబీ ఘాట్ల పరిస్థితి ఇదేవిధంగా ఉంది.

ఏడాది క్రితం మరో 9 మంజూరు..

జిల్లాలో ఏడాది క్రితం మరో 9 ధోబీ ఘాట్లు మంజూరు చేశారు. అయితే మారేపల్లి, కొత్తాపూర్ గ్రామాల్లో నిర్మాణ పనులు పనులు పూర్తయ్యాయి. జహీరాబాద్, ఆరుట్ల, చేర్యాల, గొంగ్లూర్, గుమ్మడిదల, వడ్డేపల్లిలో రూ.6 లక్షల వ్యయంతో ప్రారంభించిన ధోబీ ఘాట్ల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్మించిన ధోబీ ఘాట్లకు అధికారులు కనీస సదు పాయాలు కల్పించక పోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. ఒకపక్క చెరువుల్లో నీరు లేకపోవడం, మరోపక్క బోర్ల వద్దకు వెళితే వాటి యజమానులు అభ్యంతరం చెబుతుండడంతో బట్టలు ఉతకడానికి రజకులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ధోబీ ఘాట్లను వినియోగంలోకి తీసుకురావాలని రజకులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



నిర్మించిన ధోబీ ఘాట్లకు నీటి సౌకర్యం కల్పించక పోవడంతో ఆరేళ్లగా నిరుపయోగంగా ఉన్నాయి. కుల వృత్తిని నమ్ముకున్న మేము బట్టలు ఉతకడానికి నీళ్ల లేక అవస్థలు పడుతున్నాం. నాయకులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– చాకలి వెంకటేశం, హత్నూర

రజకులను విస్మరిస్తున్నారు



కులవృత్తులకు చేయుతను ఇస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటిస్తున్నా, క్షేత్ర స్థాయిలో ఆ మాటలు అములకు నోచుకోవడం లేదు. పలుమార్లు అధికారులు మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి దృష్టికి తీసుకుపోయినా దోబీఘాట్లను వినియోగంలోకి తీసుకురావడం లేదు. రజక సంఘం ఏర్పాటు చేసుకున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు.

–చాకలి కుమార్, దౌల్తాబాద్

నిధులు మంజూరు చేయాలి

జిల్లాలో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న ధోబీ ఘాట్లను వినియోగంలోకి తెచ్చేందుకు నిధులు మంజూరు చేయాలి. ధోబీ ఘాట్లు లేని గ్రామాలకు వెంటనే ఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. పాలకులు రజకులకు చేయూతను ఇచ్చిన దాఖలాలు లేవు.

– నాగేశ్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

జాతీయస్థాయి అడ్వెంచర్ ట్రైనింగ్‌కు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఈ నెల 23 నుంచి జనవరి 1వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే జాతీయ స్థాయి అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) విద్యార్థి ఆగస్టీన్ ఎంపికయ్యారు. అదేవిధంగా ఈ నెల 11 నుంచి 17వరకు తమిళనాడులోని మధురైలో జరిగే జాతీయ సమైక్యత క్యాంపునకు డేవిడ్ ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రసాద్ విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రద్ధానందం, కృష్ణయ్య, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ వాసం శ్రీనివాస్, డాక్టర్ పల్లవి, డాక్టర్ రాణి, డాక్టర్ మహేందర్, విశ్వనాథం, డాక్టర్ జగదీశ్వర చారి, భైరయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో ట్యాంకు ఎక్కి..


ట్యాంకు ఎక్కిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

జహీరాబాద్: తాగిన మైకంలో ఓ వ్యక్తి వాటర్ ట్యాంకు ఎక్కిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని పస్తాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి మద్యం తాగి శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుపైకి ఎక్కాడు. అనంతరం ఎటూ తోచక కేకలు పెట్టడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని ఆ వ్యక్తిని కిందకు దింపి ఆస్పత్రికి తరలించారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన ర్యాకం శ్యామ్ ఏడు నెలల క్రితం మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సీఈఐఆర్ వెబ్ సైట్లో ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దానిని భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు శ్యామ్‌కు అందజేశారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

షాద్‌నగర్: ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తానని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తన గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కష్టపడి పని చేశారని.. ఓడిపోయినంత మాత్రాన అధైర్యపడవద్దని సూచించారు. ప్రచారానికి ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు తనను ఆదరించి ప్రేమను పంచారని గుర్తు చేశారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్ పాల్గొన్నారు.

మనబడిపై నీలినీడలు

రంగులు పూసి ప్రారంభించేశారు
- పెండింగ్‌లో చాలా పనులు
- బిల్లులు రావడం లేదని చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు


పోతారం(ఎస్)లో అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం

హుస్నాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి గ్రామీణ విద్యార్థులకు కార్పొరేటు విద్య నందించాలనే ఉద్దేశంతో 2022 జూన్‌లో సర్కార్ 'మన ఊరు మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. అధికారుల పర్యవేక్షణ లోపం, నాయకుల నిర్లక్ష్యంతో 'మన ఊరు మన బడులు' అసంపూర్తి పనులతో వెక్కిరిస్తున్నాయి. ప్రభుత్వ ప్రణాళికలు క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అభివృద్ధి పనులపై స్థానిక ప్రజాప్రతినిధులు సమీక్షించకపోవడంతో బడుల్లో పలు సమస్యలు దర్శనమిస్తున్నాయి.

హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలల్లో 32 ప్రభుత్వ పాఠశాలల్లో 90 పనులు చేయడానికి ప్రభుత్వం దాదాపు రూ.9 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు చేయించే బాధ్యతలను గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లకు అప్పగించారు. ప్రధానోపాధ్యాయుల జాయింట్ బ్యాంకు ఖాతాల్లో కొన్ని నిధులను జమ చేసింది. ఇప్పటి వరకు 10 పాఠశాలల్లో పనులు ప్రారంభించగా.. అవి చివరి దశకు చేరుకున్నాయి. కూచనపల్లి పాఠశాలలో వంట గది పనులు పూర్తి చేయకుండానే రంగులు వేసి బిల్లులు తీసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌లు పనులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాఠశాలల్లో సగం సగం పనులే జరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చేసిన పనులకు అందని బిల్లులు

ప్రభుత్వ పాఠశాలల రక్షణకు ప్రహరీల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, వంట గదులు, ఫ్లోరింగ్, విద్యుత్ సౌకర్యం, మూత్రశాలలు, ఫర్నీచర్, మధ్యాహ్న భోజనం చేసేందుకు డైనింగ్‌హాల్స్ నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు సర్కార్ నిధులు మంజూరు చేసింది. జాతీయ ఉపాధిహామీ పథకం నిధులను ఈ పనులకు కేటాయించారు. పనులు చేసినా బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు మధ్యలోనే ఆపేస్తున్నారు. ముందు చేసిన పనులకే బిల్లులు రావడం లేదని కొందరు పనులను ప్రారంభించ లేదు. ప్రభుత్వం మారింది, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మారడంతో మన ఊరు మన బడి పనులు సాగుతాయా లేదా అనేది సందిగ్ధంగా ఉంది. నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గౌడ్ పాఠశాలల అభివృద్ధి పై దృష్టి కేంద్రీకరిస్తే గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పిల్లల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

> **నిధులు మంజూరు చేయాలి**
>
> 
>
> పందిల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు అధికంగా ఉన్నప్పటికి మొదటి విడతలో మన ఊరు–మన బడి కార్యక్రమానికి ఎంపిక చేయలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా మా బడికి నిధులు మంజూరు చేసి తరగతి గదుల నిర్మాణంకు ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గౌడ్ కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.
>
> – తోడేటి రమేశ్, సర్పంచ్, పందిల్ల

ఆరోగ్య నేలలకు యాజమాన్య పద్ధతులు

- పరిశోధనా స్థానం, హెడ్ సీనియర్ శాస్త్రవేత్త, శ్రీదేవి



మాట్లాడుతున్న హెడ్ శాస్త్రవేత్త శ్రీదేవి

సిద్దిపేటరూరల్: యాజమాన్య పద్ధతుల ద్వారా ఆరోగ్య నేలలను తయారు చేసుకోవచ్చని తొర్నాల పరిశోధనా స్థానం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త, డాక్టర్ శ్రీదేవి సూచించారు. బుధవారం 'ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని' వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ వారు తొర్నాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యకర నేలల సంరక్షణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడి, చౌడును తగ్గించే మార్గాలు, యాసంగి సాగుకు అనువైన ఆరుతడి పంటల గురించి ఆమె వివరించారు. పత్తి కట్టెను, వరి మొళ్లను కాల్చివేయడం వల్ల గాలి కాలుష్యంతో పాటు మొక్కలోని పోషకాలు కోల్పోతాయని తెలిపారు. అనంతరం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ విజయ్ మాట్లాడుతూ నేల ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో గ్రామీణ యువత పాత్ర గురించి తెలియజేశారు. అనంతరం తొర్నాల ఉన్నత పాఠశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు నేల, నీరు జీవనానికి ఆధారం ముఖ్య అంశాన్ని ఉద్దేశిస్తూ చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీజయ, రమాదేవి, ఉమారాణి, శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, దేశ్ పాండే ఫౌండేషన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న గురుకుల విద్యార్థినులు

చేవెళ్ల: మండలంలోని ఊర్లేళ్ల సమీపంలోని సాగర్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాలలోని అస్వస్థతకు గురైన విద్యార్థినుల పరిస్థితి మెరుగు పడుతోంది. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత 26 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ ఆధ్వర్యంలో మంగళవారం కూడా ప్రత్యేక వైద్యబృందం పాఠశాలలోనే క్యాంపు నిర్వహించి సేవలు అందించింది. విద్యార్థినులు అందరూ బాగున్నారని దామోదర్ తెలిపారు. బుధవారం ఉదయం వరకు మహిళా వైద్యులు, నర్సులు పాఠశాలలోనే అందుబాటులో ఉంటారని చెప్పారు. కాగా, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి విద్యార్థినులను విశ్రాంతి కోసం ఇంటికి తీసుకెళ్లారు. అధికారులు ఆహారానికి సంబంధించిన శాంపిల్స్‌ను తీసుకెళ్లారని, ఎందులో కల్తీ జరిగిందనేది తెలియాల్సి ఉందని ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు భోజనశాల, వంట చేసే పదార్థాలపై శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

నిరుపేదను కాల్చేస్తున్న వ్యాధి

- ఒళ్లంతా పుండ్లు, భరించలేని దురద
- కమ్మరి కొలిమిలో కాలుతున్న నర్సింలు


నర్సింలు శరీరంపై ఉన్న పుండ్లు

పాపన్నపేట(మెదక్): ఒళ్లంతా పుండ్లు.. భరించలేని దురద.. నయం కాని చర్మవ్యాధితో మూడేళ్లుగా బయటకు రాలేక.. కొలిమిలో ఇనుప కమ్మిలా కాలుతున్నాడు కమ్మరి నర్సింలు. రెండు లక్షల రూపాయలు అప్పులు చేసి వైద్యం చేయించినా ఫలితం కనిపించడం లేదు. ఇక అప్పు పుట్టని దుస్థితి. వైద్యం చేయించుకోలేక ..ఈ నరకం భరించలేను.. చావయినా ప్రసాదించమని దేవుడిని వేడుకుంటున్నాడు. తోటి వారికి బీసీ బంధు ఇచ్చినా.. ఈ దీనుని వైపు తొంగి చూసిన పాలకులు, నాయకులు లేరు. వివరాల్లోకి వెళ్తే.

మండల కేంద్రం పాపన్నపేటకు చెందిన కమ్మరి నర్సింలు నిరుపేద కుటుంబంలో జన్మించాడు. పూట గడవని స్థితిలో మూడో తరగతిలోనే చదువును ఆపేసి కమ్మరి పని చేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ వచ్చాడు. ఇతనికి భార్య కళావతి, స్వరూప, అపర్ణ, అన్నపూర్ణ కూతుళ్లు, కొడుకు నాగరాజు ఉన్నాడు. పారిశ్రామికీకరణ నేపథ్యంలో 'కమ్మరి కొలిమిలో తుమ్మలు మొలవడంతో' కూలీగా మారాడు. రెక్కలు ముక్కలు చేసుకుంటూ ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్లు చేశాడు. కొడుకు నాగరాజును డిగ్రీ వరకు చదివించాడు. ఉద్యోగం రాక అతను పాపన్నపేటలోని ఓ కార్పెంటర్ షాపులో పనిచేస్తున్నాడు. పేదరికానికితోడు మూడేళ్ల క్రితం నర్సింలు చర్మవ్యాధి బారినపడ్డాడు. కొడుకు అప్పు చేసి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులు, గాంధీలో చికిత్స చేయించాడు. అయినా వ్యాధి తగ్గకపోవడంతో ఇటీవల సంగారెడ్డిలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్తే రూ.40 వేల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. చేతిలో చిల్లి గవ్వ లేని స్థితిలో ఉన్న బాధిత కుటుంబం తల్లడిల్లుతోంది. మనసున్న మా రాజులు ఎవరైనా వైద్యం కోసం సాయం చేయాలని నర్సింలు వేడుకుంటున్నాడు. తన కొడుకు నాగరాజు 9676614082 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే చేయాలని కోరుతున్నాడు.

> **దేవుడా ఈ నరకం భరించలేను**
>
> 
>
> 'దేవుడా ఈ నరకం ఇక భరించలేను. నరక యాతన పడుతున్న. కంటి మీద కునుకు లేదు. తిరగని దవాఖాన లేదు. దొరికిన చోటల్లా అప్పు చేశా. ఇక నా వల్ల కాదు. చావును ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్న. కులవృత్తుల వారికి ఇచ్చే బీసీ బంధు కూడా ఇవ్వలేదు.
>
> – కమ్మరి నర్సింలు

కలానికి.. కన్నీళ్లు!

- రెండు దశాబ్దాలకు పైగా ప్రజాసేవ
- అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్ట్ పోరాటం
- దాతలు సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి


సీనియర్ జర్నలిస్ట్ గాండ్ల రమేశ్

రేగోడ్(మెదక్): ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించాడు. తన కలంతో ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపాడు. తాను ఎన్ని ఇబ్బందులు పడినా.. జర్నలిజాన్ని నమ్ముకుని ఎక్కడ ఏ సమస్య ఉన్నా వాలిపోయేవాడు. రెండు దశాబ్దాలకు పైగా జర్నలిజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. పేదలకు సాయం పడే అతడు మాత్రం అనారోగ్యంతో పోరాటం చేస్తున్నాడు. మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రానికి చెందిన గాండ్ల రమేశ్ 1995 నుంచి 2006 వరకు ఆయా పత్రికలలో జర్నలిస్టుగా పని చేశాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయినా జర్నలిజంపై ఉన్న ఆసక్తితో ప్రజా సమస్యలు పరిష్కారం కోసం తన కలంతో ప్రభుత్వాలను ప్రశ్నించేవాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లో కూడా ఓ పత్రికలో 2021 వరకు పని చేశాడు. అంతకు ముందు 2015లో పక్షవాతం వచ్చి త్వరగా కోలుకున్నాడు. 2021లో మళ్లీ వచ్చి తీవ్ర అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యాడు. చికిత్స కోసం ఇప్పటి వరకు సుమారు రూ.6 లక్షలు ఖర్చు అయ్యాయి. కానీ 40శాతమే కోలుకున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేక మెరుగైన చికిత్స చేయించుకోలేకపోయాడు. ప్రతీనెల మందులకు రూ.4వేలు ఖర్చు పెట్టడం కష్టంగా ఉంది. ఎందరికో వెలుగులు నింపిన జర్నలిస్ట్ రమేశ్ తానే ఆపదలో ఉన్నాడు. కర్ర సాయం లేనిది నడవ లేకపోతున్నాడు. దాతలు ముందకు వచ్చి సీనియర్ జర్నలిస్ట్ రమేశ్‌ను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సాయం చేయాలనుకునే వారు 99488 21991 నంబర్‌లో సంప్రదించవచ్చు.

రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు

సాఫ్ట్‌వేర్, గృహిణికి రూ.లక్షల్లో టోకరా



పటాన్‌చెరు టౌన్: ఇన్‌స్టాగామ్‌లో ఐఫోన్ కొనేందుకు వెళ్లి సైబర్ వలలో చిక్కుఉని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.6లక్షల 2 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. అమీన్‌పూర్ పరిధి బీరంగూడ రాఘవేంద్ర కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ 25వ తేదీన ఇన్‌స్టాగామ్‌లో ఐఫోన్ రూ.13 వేలకు వస్తుందని వచ్చిన మెసేజ్ ను చూసి అపరిచిత వ్యక్తిని సంప్రదించాడు. దీంతో ఆ వ్యక్తి ఓ లింకు పంపగా... అందులో తన వివరాలు నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేసి తన ఖాతాలో ఉన్న రూ.ఆరు లక్షల రెండు వేలు పోగొట్టుకున్నాడు. అనంతరం మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లోన్ ఇస్తామంటూ ఫోన్‌కాల్..

లోన్ ఇస్తామంటూ వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించిన ఓ గృహిణి రూ.రెండు లక్షల 71 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్‌కు చెందిన ఓ గృహిణికి నవంబర్ 6వ తేదీన రూ.లక్ష లోన్ ఇస్తామంటూ ఫోన్ కాల్ వచ్చింది. దీంతో బాధితురాలు అపరిచిత వ్యక్తి పంపిన లింకులో తన వివరాలు నమోదు చేసింది. కొద్దిసేపటికి ఆమె ఖాతాలో ఉన్న రూ.రెండు లక్షల 71 వేలు మాయమయ్యాయి. దీంతో మోసపోయినట్లు గుర్తించి బాధితురాలు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి వద్దన్నందుకు ఆత్మహత్య


సోనియా మృతదేహం

పటాన్‌చెరు టౌన్: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా జిల్లా సారాయిపల్లి గ్రామానికి చెందిన దీపక్ పటేల్ భార్య సోనియాయాదవ్(25)తో కలిసి ఆరు నెలల క్రితం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామానికి వచ్చాడు. మేస్త్రి వద్ద కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అతని భార్య ఇక్కడ ఉండటం ఇష్టం లేదని, స్వగ్రామానికి వెళ్లిపోదామని భర్తను కోరింది. కొంత డబ్బు సంపాదించుకున్న తర్వాత వెళ్దామని అతను సర్దిచెప్పి పనికి వెళ్లిపోయాడు. కోపంతో ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


మృతుడు రణధీర్

కొల్చారం(నర్సాపూర్): బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన కొల్చారం శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హన్మకొండకు చెందిన కన్నె రణధీర్(27) మెదక్‌లోని ఓ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున పని నిమిత్తం బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. కొల్చారం శివారు మెదక్–నర్సాపూర్ ప్రధాన రహదారిపై అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న క్రాష్ బరియర్స్‌ను ఢీ కొట్టాడు. ప్రమాదంలో రణధీర్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

హైనా కలకలం

చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో నాలుగు దూడలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మాచాపూర్ శివారులో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రైతులు కర్రె తిరుపతి, కప్పర భాస్కర్‌రెడ్డి, సుంచు నర్సయ్య రోజు మాదిరిగా వారి గేదెలను పశువుల కొట్టంలో కట్టేశారు. మంగళవారం ఉదయం ఇరువురి కొట్టాల వద్ద ఒక్కో దూడ, తిరుపతి కొట్టం వద్ద రెండు దూడలు గాయాలతో మృతి చెంది ఉన్నాయి. విషయం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మల్లేశం, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. దూడలపై దాడి చేసింది హైనాగా గుర్తించారు. పెద్దకోడూరులోనూ హైనా దాడి జరగడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్టు అధికారులు రైతులకు సూచించారు.

దైవదర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..

ఆటోను ఢీకొట్టిన బొలెరో.. మహిళ మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- తూప్రాన్–గజ్వేల్ రహదారి మజీద్‌పల్లి వద్ద ఘటన


మృతురాలు బాలమణి(ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఉదయం వేకువజామునే నిద్రలేచింది. ఉత్సాహంగా తయారైంది. కొమురెల్లి మల్లన్న దర్శనానికి వెళుతున్నట్లు కొడుకులు, కోడళ్లకు చెప్పింది. ఇరుగుపొరుగు వారితో కలిసి ఆటోలో బయల్దేరిన బాలమ్మ మార్గమధ్యలోనే రోడ్డు ప్రమాదానికి గురైంది. తన కోరిక తీరకుండానే కానరాని తీరాలకు చేరింది. తన కుటుంబాన్ని విషాదంలో నెట్టేసింది. వర్గల్ మండలం మజీద్‌పల్లి వద్ద మంగళవారం ఉదయం ఆటోను ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో బాలమ్మ మృతి చెందగా.. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. మిగతావారు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించి బేగంపేట ఎస్సై అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శివంపేట మండల కేంద్రానికి చెందిన మ్యాస బాలమణి(55) కూలీ పనులు చేస్తుంటుంది. భర్త నర్సింలు చాలా కాలం క్రితం మృతిచెందాడు. ఆమెకు పోచయ్య, మహేష్ అనే ఇద్దరు కుమారులు, జ్యోతి అనే కూతురు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు జరిగాయి. ఆమె మంగళవారం ఉదయం ఇరుగు పొరుగు వారితో కలిసి ఆటోలో కొమురెల్లి మల్లన్న దర్శనానికి బయలు దేరారు. వర్గల్ మండలం మజీద్‌పల్లి శివారులో గజ్వేల్–తూప్రాన్ రహదారిపై ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం వీరి ఆటోను ఢీకొట్టింది. అందులోఉన్న బాలమణి(55), ఓంకారి కృష్ణాబాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ములుగు 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలమణి మృతి చెందింది. కృష్ణాబాయికి ప్రాథమిక చికిత్స అనంతరం ములుగు ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు మ్యాస మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


ప్రమాదానికి గురైన ఆటో

దేవాలయంలో చోరీ


ప్రధాన ద్వారం తాళం పగలగొట్టిన దుండగులు


సీసీ పుటేజి దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల గ్రామపంచాయతీ శివారు, దుంపలకుంట చౌరస్తాకు సమీపంలో ఉన్న రేణుకా మాత ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియన వ్యక్తులు ఆలయం లోనికి ప్రవేశించేందుకు ప్రధాన ద్వారంకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను పగలగొట్టేందుకు ప్రయత్నించారు. అది తెరుచుకోకపోవడంతో ఆలయ ఆవరణలోని గది తాళం పగలగొట్టారు. అందులో ఉన్న ఆంప్లీఫైర్ తోపాటు సౌండ్ సిస్టంను దొంగలు ఎత్తుకెళ్లారు. వీటితో పాటు హుండీని పగులగొట్టి డబ్బులు కూడా ఎత్తుకెళ్లారు. చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డు అవుతున్నాయని హార్డ్ డిస్క్‌ను సైతం తీసుకెళ్లారు. చోరీకి గురైన వస్తువుల విలువ దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని, హుండీలో నగదు ఎంత ఉందనేది తెలియరాలేదని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15 రోజుల క్రితం కూడా హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు.